# నాన్నగారి కోరిక



కథ

మల్లాది రమాంజలి

"నాన్నగారూ! నాకూ, కరుణకీ సెలవు దొరకటం చాలా కష్టం. శృతి పెళ్లికి మిమ్మల్ని, అమ్మను ఒంటరిగా అంత దూరం పంపటం నాకు ఇష్టం లేదు. పైగా ఎండలు అక్కడ ఎక్కువగా ఉంటాయి. మీరు తట్టుకోలేరు. ఇద్దరికీ సుగరు, బి.పి. ఎక్కువగా ఉన్నాయని డాక్టర్ చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో మీరు కదలటం మంచిది కాదు. ఆలోచించుకోండి" చివరిసారిగా అన్నాడు సురేష్.

రామ్మూర్తిగారు జారిపోతున్న తన కళ్లజోడును సరి చేసుకుంటూ సురేష్ వంక దీనంగా చూశారు. ఆయన కుర్చీని ఆనుకుని నేలపై కూర్చున్న తులసమ్మగారి చేయి, ఆయన చేతిని మెత్తగా తాకింది. బాధగా భార్య కళ్లల్లోకి చూశారు రామ్మూర్తిగారు.

"మీరు బాధపడకండి. మన ఊరిని చూడాలని రాసిపెట్టి ఉంటే, తప్పకుండా ఆ టైమ్‌కి వెడతాం. లేదంటే లేదు. ప్రసాద్ మనిద్దరినీ తీసుకుని పెళ్లికి రమ్మని మరీమరీ చెప్పటం ఫోన్‌లో నేను విన్నాను. ఏ విషయం మనం చెప్పేవరకూ, మనం వెళ్లేవరకూ అతను ఎలాగూ ఊర్కోడు. మీరంటే వాడికి ఎంత ప్రాణమో నాకు తెలియనిదా" లోగొంతుకతో భర్తను ఓదార్చింది తులసమ్మ.

"ఏమో తులసీ.. నేను ఎంతకాలం బ్రతుకుతానో నాకే తెలియదు. మన ఊరు వదిలిపెట్టి చాలా కాలమైంది. పోయే ముందైనా నేను పుట్టిన ఊరును కళ్లారా చూడాలనీ కొన్ని రోజులు నేను పుట్టిన ఆ గడ్డమీద గడపాలనీ ఎన్నాళ్లుగానో అనుకుంటున్నాను. ఆ కోరిక నెరవేరేటట్టు నాకనిపించటం లేదు" బాధగా అన్నారు.

"ఊర్కోండి. అంతలా బాధపడకండి. మన పెద్దవాడూ, పిల్లలూ వెడుతున్నామని నిన్ననే చెప్పారు కదా! పోనీ వాడిని అడిగి చూద్దాం. మీ కోరిక తీర్చమని వాడిని బ్రతిమిలాడుతాను. రండి... చాలా పొద్దు పోయింది పడుకుందురుగాని" అంటూ భర్తను మంచంవైపు నడిపించింది తులసమ్మ.

* * *

"ఏరా సురేష్... నాన్నగారు ఆ ఊరు వెళ్లాలని పట్టు బడుతున్నారు. నడవలేరు. లేస్తే కూర్చోలేరు. కూర్చుంటే లేవలేరు. ఇద్దరి పరిస్థితీ దాదాపు ఒకలానే ఉంది. ఈ వయసులో కదలటం అంత మంచిది కాదు. కానీ పాపం పెద్దవారు, నోరు తెరిచి అడిగారు. కాదనలేక పోతున్నానురా" తమ్ముడితో అన్నాడు రమేష్.

"అవునన్నయ్యా! ట్రైన్‌లో ఏ.సి.లో తీసుకువెళ్లినా స్ట్రెయిన్ అవుతారేమోననే బెంగగా ఉంది నాకు. మనం నలుగురం ఉద్యోగాలకు వెళ్లిపోతాం. పిల్లలు కాలేజీలకు వెళ్లిపోతారు. ఒంటరిగా ఇంట్లో వాళ్లిద్దరినీ వదలాలన్నా భయంగానే ఉన్నది నాకు. కానీ వేరే దారి లేదు కదా! వారి కోరిక తీర్చలేదన్న మాట ఎందుకు? ఎలాగూ నీవు వెడతానంటున్నావు కదా! నేను కూడా లీవ్ కోసం ట్రై చేస్తాను, దొరికితే అందరం కలిసే వెడదాం" అన్నాడు సురేష్.

అందరూ వెళ్లాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత ఇద్దరికీ మనస్సు తేలిగ్గా ఉంది. మరో పది నిముషాలు మాట్లాడుకుని ఎవరి ఫ్లాట్‌లోకి వాళ్లు నడిచారు అన్నదమ్ములిద్దరూ.

* * *

రామ్మూర్తి, సాంబశివం అన్నదమ్ములు. రామ్మూర్తిగారికి ఇద్దరు ఆడపిల్లలు కలిగిన తర్వాత పది సంవత్సరాలకు ఆలస్యంగా రమేష్, సురేష్ పుట్టారు. సాంబశివానికి నలుగురు ఆడపిల్లల తర్వాత ఒక్కడే మగ నలుసు 'ప్రసాద్' పుట్టాడు. కొడుకు ఒక్కడే కావటంతో బాగా గారాబం చేశాడు 'సాంబశివం'. ఫలితంగా ప్రసాద్‌కి పెద్దగా చదువు అబ్బలేదు. ఆడపిల్లల పెళ్లిళ్లు అయ్యాక మధ్య వయస్సులోనే 'క్యాన్సర్'తో కన్ను మూశాడు సాంబశివం. చిన్న వయసులోనే తండ్రి పోవటంతో, ఉన్న పదెకరాల భూమీ సాగు చేస్తూ మంచి వ్యవసాయ దారుడుగా స్థిరపడ్డాడు ప్రసాద్.

బావగారి పిల్లలు చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాలలో స్థిరపడటంతో చదువు లేని తన కొడుకును చూస్తే కొంచెం చిన్నతనంగా ఉండేది అతని తల్లి కమలమ్మకి.

రామ్మూర్తి బడిపంతులుగా రిటైరయ్యాక ఉన్న కొద్దిపాటి పొలం, కాలం నాటి పెంకుటిల్లూ బేరం పెట్టి కొడుకుల దగ్గరకు ఢిల్లీ చేరుకున్నారు. కొడుకులూ, కోడళ్లూ ఆ తర్వాత మనవళ్లూ, మనవరాళ్లూ అనే జంఝాటంలో మునిగిపోయిన రామ్మూర్తి దంపతులకు మళ్లీ ఇంతకాలం తర్వాత పుట్టిన ఊరు వెళ్లాలనే ఉబలాటం, కోరిక ఎక్కువైనాయి. ప్రసాద్ కూతురు 'శృతి' పెళ్లి కూడా కలిసిరావటంతో వారి కోరిక మరీ అధికమైంది.

కొడుకులిద్దరూ ప్రయాణం గురించి చెప్పగానే రామ్మూర్తిగారి ముఖం వికసించింది. మళ్లీ ఇన్నాళ్లకు తన ఊరు వెళ్లబోతున్నందుకు సంతోషంగా... మనశ్శాంతిగా ఆ రోజు నిద్రపోయారాయన.


* * *


ట్రైన్ దిగగానే పెదనాన్నను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు ప్రసాద్.

"ఇంత పెద్ద వయసులో అంత దూరం నుంచి నా కూతురిని పెళ్లికూతురుగా ఆశీర్వదించటానికి వచ్చారు పెదనాన్నా. నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ తృప్తి చాలు నాకు. మీ పెద్దల ఆశీస్సులతో నా కూతురు పది కాలాల పాటు చల్లగా ఉంటే అంతే చాలు" ఆనందభాష్పాలు తుడుచుకుంటూ అన్నాడు ప్రసాద్.

తమ్ముడి కొడుకును అన్ని సంవత్సరాల తర్వాత చూడగానే సంతోషంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుంది రామ్మూర్తిగారికి. ఆప్యాయంగా అతని బుగ్గలు తుడిచారు. ప్రేమగా దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నారు.

బావగారిని, తోడికోడలిని చూడగానే చేతికర్రసాయంతో సంతోషంగా ఎదురొచ్చింది కమలమ్మ. ముగ్గురూ ఒకరి ముఖాల్లోకి ఒకరు ఆప్యాయంగా చూసుకున్నారు. చూపుల్లోనే ఆనందాన్ని పంచుకున్నారు. ఎన్నో యుగాలకు కలుసుకున్నట్టుగా కుశలప్రశ్నలు వేసుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒక చోటే కూర్చుని తృప్తిగా విందు భోజనం చేశారు. గత కాలపు జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారి అపురూపమైన కలయికకు బంధువులందరి కళ్లూ చెమ





ర్చాయి.

ఆ మర్నాడే పెళ్లిసందడి మొదలైంది.

తోడికోడళ్లిద్దరూ దగ్గరుండి శృతిని పెళ్లికూతురిని చేయించారు. పెద్దవాళ్లు ముగ్గురూ ఒకే సారి చిన్నపిల్లలైనట్లు, పెళ్లి సందడంతా తమదే అయినట్లుగా తిరుగుతున్నారు. ఇన్నాళ్లూ వయోభారం మీద పడినట్లున్న తల్లిదండ్రులను ఇంతలోనే అంత సంతోషంగా చూస్తున్న రమేష్, సురేష్ కళ్లు సంతోషంతో మెరిశాయి.

చాలా కాలం తర్వాత ఆ ఊళ్లోనే ఉంటున్న తన తోటి వారిని, బంధువులను కలుసుకోవటంతో సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు రామ్మూర్తి దంపతులు.

పెళ్లికూతురికి పూలజడ కుట్టడం దగ్గర్నుంచి, సందడంతా తనదే అయినట్లుగా హడావిడిగా తిరుగుతున్న తులసమ్మను ఆశ్చర్యంగా చూశారు ఆమె కోడళ్లు. సందర్భానికి తగినట్లుగా పెళ్లిపాటలన్నీ రాగయుక్తంగా పాడింది తులసమ్మ. నాయనమ్మలో ఇంత టాలెంట్ ఉందా అన్నట్లుగా ఆశ్చర్యపోయారు మనవరాళ్లు.

పెద్ద దంపతులిద్దరూ ఆదిదంపతుల్లా మంటపానికి దగ్గరగా కూర్చుని పెళ్లితంతునంతా ఆసక్తిగా, సంతోషంగా చూశారు. నవదంపతులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

అన్ని కార్యక్రమాలూ ముగిశాక శృతిని అత్తవారింటికి పంపారు ప్రసాద్ దంపతులు.

ఆ సంతోష సమయంలో తన పక్కన తన తమ్ముడు లేకపోవటంతో బాధగా కళ్లొత్తుకున్నారు రామ్మూర్తి గారు.

★ ★ ★

నాలుగు రోజులు ఆనందంగా గడిపాక ఆ రోజు రాత్రే అందరూ ఢిల్లీ బయలుదేరవలసి ఉంది.

ప్రొద్దుటే లేచి పేపర్ చూస్తున్న రామ్మూర్తిగారి దగ్గ

రకు మెల్లగా వచ్చింది తులసమ్మ.

"ఏమండీ విషయం అబ్బాయిలకు చెప్పారా" లోగొంతుకతో ప్రశ్నించింది.

"లేదు తులసీ. ప్రసాద్‌ని చెప్పమన్నాను" అన్నారు.

"ప్రసాద్ ఇక్కడ లేడండీ. బజారుకు వెళ్లాడు. మనం బట్టలవీ సర్దుకోకుండా వాడు వచ్చేవరకూ వేచి చూస్తే, అబ్బాయిలకు అనుమానం వస్తుందేమో" ఆందోళనగా అన్నది తులసమ్మ.

అప్పుడే ప్రసాద్ బయట నుంచి వస్తూ "పెద్దన్నయ్యా! ఓసారి ఇలా వస్తారా!" పెద్దగా అన్నాడు.

ప్రసాద్ మాట విని అందరూ హాల్లో సమావేశమయ్యారు. అందరినీ ఓసారి కలియచూసి "పెద్దమ్మ, పెదనాన్నగారు ఇక నుంచీ ఇక్కడే ఉండబోతున్నారు" అన్నాడు.

ప్రసాద్ మాటలకు రమేష్, సురేష్ అయోమయంగా అర్థం కానట్టుగా చూశారు.

ప్రసాద్ మళ్లీ చెప్పటం ప్రారంభించాడు.

"అవునన్నయ్యా! మీరు వింటున్నది నిజమే. వాళ్లిద్దరూ ఇక్కడే ఉండబోతున్నారు. పెదనాన్నగారు రిటైర్ అయిన తర్వాత మీతో ఢిల్లీ వచ్చేశారు. వారికి కొత్త ఊరు, కొత్త వాతావరణం, మనమళ్లు, మనుమరాళ్లతో ఇంతకాలం కాలమే తెలియలేదు. కానీ ఇప్పుడు వాళ్లకి వృద్ధాప్యం పైన పడింది. మీ పిల్లలు పెద్దవాళ్లు అవటం మీరంతా ఉద్యోగాలకు వెళ్లిపోవటంతో అసలైన వెలితి వారికి ఇప్పటికి తెలిసింది. వారి చివరి రోజులను ఇక్కడే గడపాలనే నిర్ణయానికి వచ్చారు. మీరు ఆఫీసులకు వెళ్లినా పెద్దవాళ్లిద్దరి గురించీ మీరు బెంగ పడుతున్నారనీ రెండు బాధ్యతల మధ్య నలిగి పోతున్నారనీ... అందుకోసం నలుగురి మధ్య ఉంటారని వారికీ కొంత కాలక్షేపం బాగుంటుందని... ఇరవై నాలుగు గంటలూ డాక్టర్ పర్యవేక్షణలో ఉంటారనీ... వాళ్లిద్దరినీ 'హోమ్'లో చేర్పించాలని మీరనుకుంటున్నారని, పెదనాన్న నాతో చెప్పారు" అన్నాడు.

ప్రసాద్ మాటలకు దెబ్బతిన్నట్టు చూశారు అన్నదమ్ములిద్దరూ.

వారిద్దరి ముఖాల్లోకి చూస్తూ...

"మీరు ఏ దురుద్దేశంతోనూ వారిని 'హోమ్'లో చేర్పించటం లేదని నాకు అర్థమయిందన్నయ్యా! లోకంలో అందరికీ తల్లిదండ్రులుంటారు. పెద్దవాళ్లవుతారు. కానీ వారిని 'హోమ్'లో చేర్చి మీ బాధ్యతను మీరు సక్రమంగా నెరవేరుస్తున్నామనుకుంటున్నారు. అందువల్ల మీ మనస్సు మీద ఒత్తిడి తగ్గవచ్చు. రోజూ వారిని కలిసే ఏర్పాటు మీరు చేసుకున్నా, మీకు దూరమై, మనస్సుని చంపుకుని తెలియని ఆ నలుగురి మధ్యా ఈ వృద్ధులు ఇమడగలరా! వారి శరీరాలకు మీరు మందులు వేయించవచ్చు. కానీ మనస్సులకు మందులు వేయించలేరు కదా! మనస్సు ఆనందంగా ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది అన్నయ్యా! ఇదంతా నాకు పెదనాన్న ఫోన్‌లో వివరించారు. ఉత్తరాల ద్వారా అందించారు. ఒరే ప్రసాదూ... తెలియని ఆ నలుగురి మధ్యా కంటే తెలిసిన మీ నలుగురి మధ్యా నా ఇంట్లో శేషజీవితాన్ని గడపాలని ఉందిరా అంటూ తన కోరికను వెల్లడించారు. మీ ఇల్లు ఇదివరలో కొనుక్కున్నవాళ్లు అమ్ముతుంటే పెదనాన్న కోసం నేనే కొన్నాను. వాళ్లిద్దరూ సంతోషంగా, తృప్తిగా ఉంటే వారి జీవితానికి ఇంకేం కావాలి?" గంభీరంగా అన్నాడు ప్రసాదు.



అన్నదమ్ములిద్దరూ ప్రసాద్ మాటలన్నీ ఆసాంతం ఓపిగ్గా విన్నారు. "ప్రసాద్! నువ్వు, నాన్నగారు మమ్మల్ని చాలా అపార్థం చేసుకున్నారు. ఈ వయస్సులో ఒంటరిగా, ఇంట్లో బందీల్లా... బయటకు వెళ్లిన పిల్లలు ఎప్పుడు వస్తారా అని ఆశగా, దీనంగా బాల్కనీల నుంచి ఎదురు చూసే తల్లిదండ్రులను అనేకమందిని చూశాం. ఫోన్‌ల సౌకర్యం ఉన్నా ఈ వయస్సులో ఎవరికి ఏ అనారోగ్యం ముంచుకు వస్తుందో తెలీదు...

ఈ రోజుల్లో సిటీలైఫ్ నీకు తెలియనది కాదు కదా! ఇద్దరూ సంపాదిస్తేనే బ్రతుకులు వెళ్లదీయగలం. పిల్లలను మనం అనుకున్నట్లుగా మన కోరిక ప్రకారం తీర్చిదిద్దగలం. సిటీలో ఎవరి జీవితాలు వారివి. ఒకరి గురించి ఒకరు పట్టించుకోరు. ఇటు ఉద్యోగ బాధ్యతా, అటు పెద్దవాళ్ల బాధ్యతా... సక్రమంగా నిర్వర్తించటం కత్తిమీద సాము లాంటిది. అమ్మా, నాన్నా మాకు బరువై మేము వాళ్లని 'హోమ్'లో చేర్చాలని అనుకోలేదు. ఎంత కాలమని వాళ్లు ఆ నాలుగు గోడల మధ్యా గడపగలరు? సమవయస్కుల మధ్య గడుపుతుంటే వారికీ ఆనందంగా ఉంటుందనీ, హోమ్‌వాళ్లు డాక్టర్ పర్యవేక్షణలో బాధ్యతగా చూస్తారనీ భావించి ఈ నిర్ణయం తీసుకున్నాం. సాయంత్రం ఓ రెండు గంటలు వారితో ఆనందంగా గడిపి రావాలని నిర్ణయించు

## బికినీ వేయను

**సల్మాన్ ఖాన్ తాజా చిత్రం 'వీర్' ద్వారా తెరకి పరిచయమైన కొత్త భామ 'జరీన్ ఖాన్'ని పరాగ్గా చూసామంటే కత్రినా కైఫే అనుకుంటాం. అసలు తన పక్కన హీరోయిన్‌గా సల్మాన్ ఆమెని ప్రోత్సహించడానికి కూడా ఇదో కారణమంటారు. ఈ డూప్లికేట్ కత్రినా- బికినీ ధరించడానికి నేను వ్యతిరేకిని అంటూ సెలవిచ్చిందీమధ్య. అన్ని తరహా పాత్రలూ పోషిస్తాను, గ్లామర్‌గా కనిపించేందుకు మోడర్న్ దుస్తులు కూడా వేసుకుంటాను కానీ బికినీ మాత్రం వేసే ప్రసక్తే లేదు' చెప్పేసింది.**

కున్నాం. ఈ ఊరితో మా బంధం తెగిపోయిందని, ఆస్తి పాస్తులు లేకుండా, నిలువ నీడ లేకుండా చేసుకున్నామని అనుకున్నాము గానీ, మీ మనస్సుల్లో మాకు స్థానం పోలేదని గ్రహించలేక పోయాం. మమ్మల్ని క్షమించండి" అంటూ అందరికీ నమస్కారం చేస్తూ తలదించుకున్నాడు రమేష్.

"అన్నయ్యా! మిమ్మల్ని కించపరచాలని నా ఉద్దేశ్యం కాదు. దయచేసి నన్నర్థం చేసుకోండి. మీరు రెండు బాధ్యతల మధ్య నలిగిపోతున్నారని మేమర్థం చేసుకున్నాం. ఇవే సమస్యల మధ్య నలిగిపోయే బంధువులు అనేకమంది ఉన్నారు మనలో. వారందరికీ ఈ ఇల్లు ఆశ్రయం అవుతుంది... ఇది ఒక హోమ్‌గా కాకుండా 'పెదనాన్నగారి ఇల్లు'గా చలామణి అవుతుంది. వీరందరికీ అన్ని పనులలో సాయం చేయడానికి ఓ ఇద్దరు మనుషులను పెట్టాలనుకుంటున్నాను. ఈ ప్రశాంతమైన వాతావరణంలో వారికి ఏ అనారోగ్యమూ దరి చేరదు. దగ్గరి ఊరిలోనే మంచి డాక్టర్ సౌకర్యం కూడా ఉంది.

మీరు వారి వైద్యం గురించి బెంగపడవలసిన అవసరం లేదు. పెదనాన్న ఉద్దేశ్యం కూడా అదే... ఎక్కడ ఉన్నా వారిద్దరి ఆశీస్సులూ మీకుంటాయి. వారిని పువ్వుల్లో పెట్టి మేము చూసుకుంటాం. దిగులు పడవద్దు. వారి శేషజీవితం ఇక్కడే గడిచిపోనీ. మీరు క్షేమంగా వెళ్లి రండి" అన్నాడు ప్రసాద్.

"వద్దు నాన్నగారూ! మీరిద్దరూ ఇక్కడ, మేము అక్కడ కొడుకులుండి కూడా ఒంటరిగా ఈ పల్లెలో ఒదిలారని అపప్రథ వస్తుంది. మీ బాధ్యత మాదే. మీరు ఎప్పుడు రావాలన్నా మేము మిమ్మల్ని జాగ్రత్తగా ఇక్కడికి తీసుకు వస్తాం. మిమ్మల్ని చూడకుండా మేము ఉండలేము. మీరు మాకు బరువనే ఉద్దేశ్యంతో హోమ్‌లో చేర్చాలని అనుకోలేదు. మీ వయస్సు రీత్యా, ఆరోగ్యా రీత్యా, ఇరవై నాలుగు గంటలూ మీకు రక్షణ ఉంటుందనే ఉద్దేశ్యంతో అలా ఆలోచించాం. తప్పయితే దయచేసి క్షమించండి" చేతులు జోడిస్తూ అన్నాడు రమేష్.

"వద్దు మామయ్యగారూ! మీరు మాతో వచ్చెయ్యండి" కోడళ్లు ఏక కంఠంతో అన్నారు.

మనవరాళ్లు, మనవలు నానమ్మను, తాతగారిని ప్రేమగా చుట్టేశారు.

"ప్రసాద్! కొడుకులం మేముండగా, వాళ్లు ఇక్కడ ఉండటం ఏమిటి? అమ్మా, నాన్నా మాతోనే ఉంటారు. హోమ్‌కి పంపాలనే ఉద్దేశ్యం విరమించుకుంటాం. వారిద్దరి కోసం ఒక సర్వెంట్‌ని ఏర్పాటు చేస్తాం. వాళ్లు మా కళ్లెదురుగా ఉంటే మాకు తృప్తి కదా!" అన్నాడు సురేష్.

"వద్దన్నయ్యా! ప్రతి రోజూ పేపర్‌లో ఎన్ని వార్తలు చదవటం లేదు. ముక్కూ ముఖం తెలియని సర్వెంట్స్‌ని ఇంట్లో ఉంచుకోవటం వారిద్దరికీ క్షేమం కాదు. వారి కోరికే సబబుగా తోస్తోంది నాకు" అన్నాడు ప్రసాద్.

"రమేష్.. మీ ఇద్దరినీ సంప్రదించకుండా నేనీ నిర్ణయం తీసుకున్నందుకు ఏమీ అనుకోవద్దు. నేను ముందుచూపు లేకుండా ఆస్తులన్నీ అమ్మేశాను. వాటి అవసరం ఇప్పటికీ అనుభవంలోకి వచ్చింది నాకు. ప్రసాద్ జోక్యంతో మళ్లీ మన ఆస్తిని నిలుపుకోగలిగాను. ప్రతి వ్యక్తీ రిటైర్మెంట్ తర్వాత గడపబోయే జీవితాన్ని ముందుగానే ప్లాన్ చేసుకుంటే పిల్లలకీ కష్టాలు ఉండవు. మా చివరి రోజులు ఈ గడ్డమీద గడపాలని కోరుకున్నాం. అందుకు మీరు ఇష్టపడకపోవచ్చు. మమ్మల్ని ఒదిలి ఉండలేకపోవచ్చు. కానీ ఒకటి పొందాలంటే ఒకటి త్యాగం చేయక తప్పదు.. మీకు వీలైనప్పుడు మమ్మల్ని చూడటానికి వస్తే ఈ ఊరు మిమ్మల్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తుంది. క్షేమంగా వెళ్లిరండి... మా ఆశీస్సులు మీకెప్పుడూ ఉంటాయి" కొడుకుల్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు రామ్మూర్తిగారు.

బంధువులంతా ఏక కంఠంతో ప్రసాద్ ఆలోచనకు మద్దతునిస్తుంటే రమేష్, సురేష్ ఆలోచనలో పడ్డారు. ఒకరికొకరు సంప్రదించుకున్నారు. వారందరి ప్రతిపాదనకు మరేమీ మాట్లాడలేకపోయారు.

చివరికి-

"సర్లేండి నాన్నా! మీరంతగా కోరుతున్నారు కాబట్టీ మేము ఒప్పుకోవలసి వస్తోంది. మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. అమ్మా! మమ్మల్ని ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు కాకితో కబురు చేసినా వచ్చి వాలిపోతాం. మీరిద్దరూ ఎక్కడ ఉన్నా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండటమే మాకు ఆనందం" అన్నారు.

తల్లిదండ్రులు తమతో చెప్పకుండా ఆ నిర్ణయం తీసుకున్నందుకు రమేష్, సురేష్ చిన్నబోయినా, వారి ఆఖరి కోరిక తీరబోతున్నందుకు ఆనందించి... అందరూ వారి ఆశీస్సులందుకొని మౌనంగా రైలెక్కారు.

## బాబోయ్ శ్రద్ధ!

**విలన్, కామెడీ వేషాలు శక్తికపూర్ కూతురు శ్రద్ధాకపూర్ కూడా 'తీన్ పత్తీ' సినిమాతో బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేసింది. అమితాబ్-బెన్ కింగ్‌స్లే లాంటి ఇద్దరు హేమాహేమీలతో తొలిచిత్రంలోనే కలిసి నటించిన శ్రద్ధకి తెలితేటలు బాగానే వున్నాయంటున్నారు. ఎందుకంటే ఈ సినిమా విడుదలకు ముందే ఓ నిర్మాత వచ్చిన సినిమా ఆఫర్ ఇస్తే ఏకంగా కోటి రూపాయల పారితోషికాన్ని డిమాండ్ చేసిందిట. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి నిజమే, మరీ ఇంత ఇదిగానా అని విస్తుబోవటం ఆ నిర్మాత వంతయిందిట.**

